సాక్షి జోగులాంబ గద్వాల

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

జిల్లావ్యాప్తంగా సోమవారం నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వివరాలు 9లో ▸



వచ్చే నెల 'పాలమూరు' నీళ్లు

వచ్చేనెల 15న సాగునీరు విడుదల చేయాలని సీఎంవో కార్యదర్శి అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /23.1


వాతావరణం

ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా వర్షం పడవచ్చు.

● 'కారు'.. ఖరారు

'సిట్టింగ్'లకే సీట్లు

- ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలు
- ఎమ్మెల్సీ కసిరెడ్డి, ఎంపీ రాములు తదితరులకు నిరాశ
- అభ్యర్థుల ప్రకటనతో ఎన్నికల సన్నద్ధతలో బీఆర్ఎస్ ముందంజ
- ఎన్నికలకు 4 నెలల ముందే రాజుకున్న రాజకీయ వేడి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచే భారత రాష్ట్ర సమితి అభ్యర్థుల జాబితా ఖరారైంది. రాష్ట్రంలో 119 నియోజకవర్గాలకు గాను 115 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటిస్తూ ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సోమవారం జంబో జాబితా విడుదల చేశారు. ఉమ్మడి పాలమూరుకు సంబంధించి మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. అన్ని సెగ్మెంట్లలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే చోటు దక్కింది. పార్టీలో అలకలు, అసమ్మతికి చోటులేకుండా బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల్లో అభ్యర్థుల బలాబలాలు, గెలుపు అంచనాలు, అసంతృప్తుల నివారణ, వివిధ సర్వేల ఆధారంగా పార్టీ అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్లు సమాచారం. ఏదేమైనా ఎన్నికలకు నాలుగు నెలల ముందే అభ్యర్థుల ప్రకటనతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. గెలుపే లక్ష్యంగా ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణతో వివిధ కార్యక్రమాలను విస్తృతం చేస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు నేటి నుంచి పూర్తిగా ఎన్నికల సన్నద్ధతలో నిమగ్నం కానున్నారు.

4 నెలల ముందే రాజుకున్న వేడి

అసెంబ్లీ ఎన్నికలకు దాదాపు నాలుగు నెలల సమయం ఉండగానే అధికార బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటనతో సమరశంఖం మోగించింది. గెలుపే లక్ష్యంగా అందరి కన్నా ముందుగా అభ్యర్థులను ఖరారు చేసి ఎన్నికల సన్నద్ధతలో ముందంజలో నిలిచింది. పార్టీ అభ్యర్థిగా ప్రజల్లోకి వెళ్లేందుకు రూపొందించుకున్న ప్రత్యేక కార్యాచరణ ప్రకారం ఆయా నేతలు ప్రజాక్షేత్రంలో ఉండేలా ప్రణాళిక అమలు చేస్తోంది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా.. ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ఒక్కో రోజున ఒక్కో కార్యక్రమం చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఎన్నికలకు నాలుగు నెలల ముందే రాజకీయ వేడి రాజుకున్నట్లు తెలుస్తోంది.

పలువురు ఆశావహులకు నిరాశ..

ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఈ సారి మార్పులు చోటుచేసుకుంటాయని.. తమకు అవకాశం దక్కుతుందని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు ఆశించారు. అయితే కేసీఆర్ ప్రకటనతో ఆయా నేతలు, వారి అనుచరుల్లో నైరాశ్యం అలుముకుంది. పార్టీ అభ్యర్థిత్వంపై తాజా ప్రకటన నేపథ్యంలో అసంతృప్త నేతలు అన్నీ మరచి పార్టీ గెలుపు కోసం పనిచేస్తారా.. లేక మరేదైనా నిర్ణయం తీసుకుంటారా.. అన్నది ఆసక్తికరంగా మారింది.

■ అచ్చంపేట నుంచి తనకు లేదా తన కుమారుడు భరత్‌కు ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఎంపీ రాములుకు సైతం భంగపాటు తప్పలేదు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకే టికెట్ ఖరారు చేయడంతో ఎంపీ వర్గీయులు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తనకు జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని దక్కకుండా ఎమ్మెల్యే బాలరాజు అడ్డుపడ్డారని భావిస్తున్న భరత్ వర్గీయులు సమాలోచనలు చేస్తున్నట్లు తెలిసింది.

■ జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే అబ్రహంకే ఖరారు కాగా.. అక్కడక్కడ అసంతృప్తి సెగలు ఇప్పుడిప్పుడే రాజుకుంటున్నట్లు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ నిర్ణయంపై చల్లా వర్గీయులు అసంతృప్తితో ఉన్నారు. అబ్రహంకు టికెట్ ఖరారైన నేపథ్యంలో అలంపూర్ మండలం క్యాతూర్ సింగిల్ విండో చైర్మన్ రాఘవరెడ్డి సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. 'అబ్రహంకు అలంపూర్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వొద్దని.. ఇస్తే సహకరించమని.. వేరే వారికి ఇస్తే సహకరించి గెలిపించుకుంటామని' అందులో పేర్కొన్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఈసారి టికెట్ తనకే వస్తుందనే ధీమాతో ఉన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి నిరాశే ఎదురైంది. ఇప్పటికే పలుమార్లు ఆయన పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఈసారి ఎన్నికల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అయితే బీసీ కోటాలో మళ్లీ జైపాల్‌యాదవ్‌కే అవకాశం దక్కడంతో కసిరెడ్డి వర్గీయులు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్యులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి.. పార్టీ మారాలని, లేకుండా ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

జిల్లాలోని బీఆర్ఎస్ అభ్యర్థుల రాజకీయ నేపథ్యం

అలంపూర్: వీఎం అబ్రహం

అరబ్ దేశాల్లో 12 ఏళ్లు, స్థానికంగా 22 ఏళ్లు వైద్య వృత్తిలో కొనసాగిన వీఎం అబ్రహం 2009లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ప్రసన్నకుమార్‌పై రెండు వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2014లో మారిన రాజకీయ పరిణామాల క్రమంలో టీడీపీ నుంచి బరిలో నిలిచిన ఆయన కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ చేతిలో సుమారు నాలుగు వేల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) నుంచి పోటీ చేసిన అబ్రహం 44,508 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌పై గెలుపొందారు.

గద్వాల: బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే డీకే భరత్‌సింహారెడ్డి మేనల్లుడిగా బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 1996లో గద్వాల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారు. రాజకీయ విభేదాలు పొడచూపడంతో 2004లో భరత్‌సింహారెడ్డితో విడిపోయి టీడీపీలో చేరి వేరుకుంపటి పెట్టారు. 2005లో గద్వాల మండలంలో టీడీపీ నుంచి జెడ్పీటీసీగా గెలుపొంది తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం అంచెలంచెలుగా ఎదిగి 2009లో టీడీపీ నుంచి గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి.. మాజీ మంత్రి డీకే అరుణ చేతిలో 10,427 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో టీడీపీ వీడి వైఎస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో 2014లో బీఆర్ఎస్‌లో చేరి పార్టీ అభ్యర్థిగా మరోమారు మాజీ మంత్రి డీకే అరుణతో తలపడ్డారు. ఆ ఎన్నికల్లో కూడా డీకే అరుణ చేతిలో 8,260 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అయితే తన అనుచరవర్గానికి ఉమ్మడి పాలమూరు జెడ్పీ చైర్మన్ పీఠం కైవసం చేసుకుని సత్తా చాటారు. అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో జిల్లాలో తన ప్రాబల్యం పెంచుకున్నారు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి నిలబడి 28,260 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి డీకే అరుణను ఓడించారు.



బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రొఫైల్స్, అభిప్రాయాలు

- వివరాలు 8లో..

న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు

గద్వాల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 7 ఫిర్యాదులు అందాయి. వివిధ మండలాలకు చెందిన అర్జీదారులు భూ వివాద, కుటుంబ, ఆస్తి తగాదాలపై ఎస్పీ సృజన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎస్పీ వారితో మాట్లాడుతూ.. విడతల వారిగా సమస్యలు పరిష్కారం చేస్తామని బాధితులకు వివరించారు. సివిల్ కేసులను కోర్టులో పరిష్కారం చేసుకోవాలని ఎస్పీ ఫిర్యాదుదారులకు తెలియజేశారు.

గద్వాల కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు



గద్వాల రూరల్: గద్వాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకు కేటాయించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్‌ను కోరారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహేష్‌గౌడ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా కె.విజయ్‌కుమార్ కూడా తనకు గద్వాల ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.


ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్వేతా ప్రియదర్శిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 2023–24విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఫ్రెష్, రెన్యూవల్ కొరకు 31.12.2023లోగాhttp://www.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఉపకార వేతనాల కోసం నమోదు చేయించి, దరఖాస్తు ఫారములను సంబంధిత కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

గద్వాల రూరల్: జిల్లా వ్యాప్తంగా చౌకధర దుకాణాలలో పీడీఎస్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా అర్హులైన రేషన్‌కార్డు లబ్ధిదారులకు పీడీఎస్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బలవర్ధకమైన బియ్యం ప్రాధాన్యతను వివరించాలన్నారు. సమావేశంలో డీఈఓ సిరాజుద్దీన్, డీఆర్‌డీఓ ఉమాదేవి, డీఎస్‌ఓ రేవతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గూటికి అభిలాష్‌రావు



- నేడు అనుచరులతో 'ఆత్మీయ సమావేశం'
- కార్యకర్తలతో చర్చించాకే నిర్ణయం: అభిలాష్‌రావు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు కాంగ్రెస్‌ను వీడి గులాబీ కండువా కప్పుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలతో చర్చలు జరిగినట్టు ప్రచారం సాగుతోంది. మంగళవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో ముఖ్య అనుచరులు, కార్యకర్తలతో 'ఆత్మీయ సమావేశం' నిర్వహించనున్నారు. ఈ సమావేశం అనంతరం అభిలాష్‌రావు తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అభిలాష్‌రావు గత అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తిలో బీఆర్ఎస్ తరఫున బరిలో ఉన్న మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం పని చేశారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గ టికెట్ ఆశిస్తూ రెండేళ్ల కిందటే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు చేరడం, వారి వర్గానికే ప్రాధాన్యం కల్పిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అభిలాష్‌రావు తిరిగి గులాబీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. రాజకీయ భవిష్యత్ కోసం బీఆర్ఎస్‌లో చేరితే ఏదైనా కీలకమైన పదవి దక్కుతుందని బీఆర్ఎస్ నేతలు హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఈ మేరకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలతో అభిలాష్‌రావు కలసి చర్చించినట్టు ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అభిలాష్‌రావు అండగా నిలుస్తారని భావిస్తున్న నేపథ్యంలో ఆయన పార్టీ వీడుతున్నట్టుగా ప్రచారం సాగుతుండటం ఆసక్తికరంగా మారింది.

ముగ్గురు మూడేసి సార్లు గెలుపు

ఉమ్మడి పాలమూరులో కల్వకుర్తి నుంచి జైపాల్ యాదవ్ (టీడీపీ–3, బీఆర్ఎస్–2)ఐదు సార్లు పోటీ చేసి మూడుసార్లు, మక్తల్ నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి (కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 1), జడ్చర్ల నుంచి చర్లకోల లక్ష్మారెడ్డి (బీఆర్ఎస్) నాలుగు పర్యాయాలు పోటీ చేసి.. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలంపూర్ నుంచి అబ్రహం (కాంగ్రెస్–1, టీడీపీ–1, బీఆర్ఎస్ –1), నాగర్‌కర్నూల్ నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి (టీడీపీ 1, బీఆర్ఎస్ 2) మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండుసార్లు గెలిచారు. మహబూబ్‌నగర్ నుంచి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దేవరకద్ర నుంచి ఆల వెంకటేశ్వరెడ్డి(బీఆర్ఎస్), నారాయణపేట నుంచి రాజేందర్ రెడ్డి (టీడీపీ–1, బీఆర్ఎస్–1), అచ్చంపేట నుంచి గువ్వల బాలరాజు, షాద్‌నగర్ నుంచి అంజయ్యయాదవ్ (బీఆర్ఎస్)నుంచి రెండుసార్లు పోటీ చేసి విజయం సాధించారు. ఈసారి హ్యాట్రిక్ సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు. వనపర్తి నుంచి మంత్రి నిరంజన్‌రెడ్డి, గద్వాల నుంచి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మూడేసి సార్లు పోటీ చేసి ఒకసారి, కొల్లాపూర్ నుంచి హర్షవర్ధన్‌రెడ్డి రెండుసార్లు పోటీచేసి ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొడంగల్ నుంచి పట్నం నరేందర్‌రెడ్డి గత ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించగా.. మరోసారి బరిలో నిలవనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 14 స్థానాల్లో 2018లో పోటీచేసిన 13 అభ్యర్థులకే ఈసారి కూడా టికెట్లు దక్కాయి. కొల్లాపూర్‌లో జూపల్లి కృష్ణారావు ఓడిపోగా.. కాంగ్రెస్ నుంచి అక్కడ గెలిచిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో.. ఆయనకు ఈ సారి టికెట్ దక్కింది.

బాలశక్తి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2023–24లో అందించనున్న బాలశక్తి పురస్కార్ అవార్డులకు అర్హులైన చిన్నారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ముసాయిదా బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతిక తదితర రంగాల్లో ప్రతిభ చాటి 6–18 వయస్సు ఉన్న చిన్నారులు ఈ నెల 30వ తేదీలోగా https://awards.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పల్లెల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. సోమవారం ఇటిక్యాల మండల పరిధిలోని మొగిలి రావుల చెర్వు గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి గ్రామ ప్రజలతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ పని చేసినా అది ప్రజల అవసరం కోసమే అని మర్చిపోరాదన్నారు. చిన్న చిన్న కారణాలతో అనవసరంగా ప్రభుత్వ పనులను అడ్డగిస్తే చర్యలు తప్పవని సూచించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రాఘవ, పాండురంగారావ ఉన్నారు.

ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరందించాలి

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరందించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావుతోపాటు వివిధ మండలాల బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పట్టణంలోని కర్నూలు–రాయిచూరు టీ రోడ్డుపై ధర్నా చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వంపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు మాట్లాడుతూ.. అలంపూర్ నియోజకవర్గంలోని రైతులు ఆర్డీఎస్ నీటికోసం ఎదురుచూస్తున్నారని, ఆర్డీఎస్ కాలువ 15.9 టీఎంసీల నీటి వాటా కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అబ్రహం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించకపోవడం ఏమిటని, ఆర్డీఎస్ కాల్వ కింద సాగుచేస్తున్న రైతులపై ప్రభుత్వం వివక్ష చూపడం, కాల్వ ఆధునీకరణకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఆర్డీఎస్ కెనాల్ పక్కన బీటీ రోడ్లు నిర్మించాలని, కాల్వలకు మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా.. పోలీసులకు బీఎస్పీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. బీఎస్పీ నాయకులు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేవశరావు, మధుగౌడ్, వెంకటేష్, హనుమన్న, యువరాజును అరెస్ట్ చేసి, అనంతరం వదిలిపెట్టారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

జిల్లాలో మొత్తం ఓటర్లు 4,78,951

- మహిళ ఓటర్లే అధికం
- సెప్టెంబర్ 19తేదీ వరకు మరో అవకాశం
- అక్టోబర్ 4న తుదిజాబితా విడుదల

గద్వాల రూరల్: రాబోయే శాసన సభ ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం సంసిద్ధమవుతుంది. ఇందులో భాగంగా ఈవీఎంలో ఓటుహక్కును ఎలా వినియోగించుకోవాలి, అర్హులైన ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని విస్తృతప్రచారం చేపట్టి అవగాహన కల్పించారు. ఈ క్రమంలోనే ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఈమేరకు అధికారులు జిల్లా ఓటర్ల జాబితాను విడుదల చేశారు.

ఓటు నమోదు, మార్పు చేర్పులకు అవకాశం

ప్రజల నుంచి తొలిగింపు, చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి ఆగష్టు 21వ తేదీ ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ఇలా విడుదల చేసిన ముసాయిదా జాబితాలో పేర్లు మార్పులు, ఫొటో లేకపోవడం సమస్యలపై ఈనెల 22వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 19వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన అర్హులు కూడా కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. తదనంతరం ఓటరు తుది జాబితాను అక్టోబర్ 4వ తేదీన విడుదల చేస్తారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు మీ–సేవా, ఇంటర్‌నెట్, ఎన్‌వీఎస్‌పీ వెబ్‌సైట్‌తో పాటు, స్మార్ట్ ఫోన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. నూతన ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారికి సెప్టెంబర్ 19వ తేదీ వరకు అవకాశం కల్పించిందని 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు తప్పకుండా ఓటునమోదు చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఇందుకు ఓటు ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



సద్వినియోగం చేసుకోవాలి

సెప్టెంబర్ 19వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల అవకాశం కల్పించింది. ఆ సమయం నాటికి 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు కూడా తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలి. ఓటు ప్రాధన్యతపై ఇప్పటికే పలురకాలుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ఓటరు జాబితాలో డిలీషన్, యాడీషన్ ప్రక్రియ కొనసాగుతుంది. ఓటర్లు ఏమైన మార్పులు ఉంటే సరి చేసుకునేందుకు అవకాశం ఉంది.

– వల్లూరు క్రాంతి, కలెక్టర్

జిల్లా ఓటర్లు 4,78,951

సోమవారం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,78,951. కాగా ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మహిళా ఓటర్లు 2,41,019 కాగా, పురుషులు 2,37,914, ఇతరులు 18మంది ఉన్నారు. గద్వాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,48,325 కాగా ఇందులో మహిళా ఓటర్లు 1,25,396, పురుష ఓటర్లు 1,22,917, థర్డ్‌జెండర్ ఓటర్లు 12 మంది ఉన్నారు. ఇక అలంపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,30,626, మహిళా ఓటర్లు 1,15,623, పురుషుల ఓటర్లు 1,14,997, థర్డ్ జెండర్ ఓటర్లు ఆరు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

లక్కు దక్కింది..

- సిండికేట్లకే వరించిన మద్యం దుకాణాలు
- 36 దుకాణాలకు కలెక్టర్ లక్కీ డ్రా
- సరిహద్దు దుకాణాల కేటాయింపులో తీవ్ర ఉత్కంఠ
- నిరాశతో వెనుదిరిగిన వ్యాపారులు

గద్వాల క్రైం: సిండికేట్లకే లక్కు చిక్కింది. మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు మద్యం వ్యాపారులు సిండికేటుగా మారి నూతన మద్యం పాలసీ వ్యాపారంలో దుకాణాలు దక్కించుకున్నారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రత్యేకాధికారి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మద్యం దుకాణాల లక్కీ డ్రాను చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 36 దుకాణాల కోసం 1179 దరఖాస్తులు అందాయి. వ్యాపారుల సమక్షంలో లక్కీ డిప్ తీశారు.

వ్యూహాత్మకంగా దక్కించుకున్నారు..

ముందు నుంచి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు రాష్ట్రంలోపాటు ఆంధ్రాకు చెందిన కొందరు వ్యాపారులు జిల్లాకు చెందిన వారితో వ్యూహాలు పన్నారు. మంచి లాభాలు ఉండడం, మద్యం దుకాణం చుట్టూ వ్యాపార సముదాయం, చిరు వ్యాపారుల నుంచి వచ్చే అద్దెలు తదితర విషయాలపై లెక్కలు వేసుకున్నారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో మద్యం ధరలలో పెద్ద మొత్తంలో వ్యత్యాసం, రాబోవు అసెంబ్లీ ఎన్నికలు దృష్ట్యా సిండికేట్‌గా మారి పలు దుకాణాల కోసం ఒకటి నుంచి 30 దరఖాస్తులు సిండికేటు వ్యాపారులే వేయడం వారికి కలిసి వచ్చింది. దాదాపు 15 మద్యం దుకాణాలు సిండికేటు వ్యాపారులకే లక్కీ డ్రాలో దక్కాయి. గద్వాలకు చెందిన లీక్కర్ వ్యాపారి సైతం తనదైనీ శైలిలో బినామీల పేరిట దరఖాస్తులు వేయించి 5 మద్యం దుకాణాలను దక్కించుకున్నాడు. అయితే అలంపూర్ సరిహద్దులోని రెండు మద్యం దుకాణాలు వర్తింపు విషయంలో తీవ్ర ఉత్కంఠ మధ్య డ్రా నిర్వహించారు. షాపు నంబర్ 28కు 100 దరఖాస్తులు రాగా కర్నూల్ జిల్లాకు చెందిన క్రిష్ణవేణికి అదృష్టం వరించింది. షాపు నంబర్ 31కు 72 దరఖాస్తులు రాగా రంగారెడ్డి జిల్లాకు చెందిన బాలక్రిష్ణగౌడుకు దక్కింది. అయితే ఆ రెండు దుకాణాలకు సైతం సిండికేటు వారికే దక్కాయి. కొత్తగా ఈ వ్యాపారంలో వారి అదృష్టం పరీక్షించుకుందామంటే నిరాశే ఎదరైంది. చాలా వరకు వ్యాపారంలో అనుభవం ఉన్న వారికే దక్కడం కొసమెరుపు.



మద్యం దుకాణాలకు లక్కీ డ్రా తీస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

మీడియాకు అనుమతి నిరాకరణ

ఇదిలాఉండగా, లక్కీ డ్రా కార్యక్రమానికి మీడియాను అనుమతించలేదు. సజావుగా జరిగే ప్రక్రియను మీడియా ఎదుట నిర్వహించకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, దుకాణాలు దక్కించుకున్న వ్యాపారుల నుంచి ఆరో వంతు నగదును ప్రభుత్వ ఖాతాలోకి మళ్లించారు. ఒకటవ తేది నుంచి వ్యాపారం చేసుకునేందుకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది గోపాల్, బానోవత్ పటేల్, హనుమ నాయక్, రాజేందర్, క్రిష్ణ, మెగులయ్య సిబ్బంది ఉన్నారు.



లక్కీ డ్రాకు హాజరైన వ్యాపారులు



మహబూబ్‌నగర్

పేరు : విరసనోల్ల శ్రీనివాస్‌గౌడ్
పుట్టిన తేదీ : 16.03.1969
విద్యాభ్యాసం : బీఎస్సీ, పీజీడీసీజే, మాస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం
భార్య : శారద,
సంతానం : ఇద్దరు (కూతుళ్లు)
స్వగ్రామం : రాచాల, అడ్డాకుల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా.
పదవులు :
ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. శాంత, బయోటెక్ కంపెనీ, హెచ్ఐఎల్ కంపెనీ, తెలంగాణ హోంగార్డు సంక్షేమ సంఘం, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్, తెలంగాణ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్‌లకు గౌరవాధ్యక్షుడిగా పనిచేశారు. 2008లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం స్థాపన, తెలంగాణ ఉద్యమంలో ఏర్పడిన జేఏసీకి కోచైర్మన్‌గా వ్యవహరించారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి 2014లో, 2018లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

వనపర్తి

పేరు : సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
పుట్టింది : 4.10.1958
స్వస్థలం : పాన్‌గల్, వనపర్తి జిల్లా
తల్లితండ్రులు : తారకమ్మ, రామిరెడ్డి
భార్య : వాసంతి
సంతానం : ముగ్గురు కూతుళ్లు (ప్రత్యూష, తేజశ్విని, అమృత వర్షిణి)
విద్యార్హత : బీఎస్సీ, ఎల్ఎల్‌బీ
వృత్తి : న్యాయవాది
పదవులు : తన మామ నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు.
టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి రాష్ట్రంలో ఖాదీ బోర్డు చైర్మన్‌గా, తెలంగాణ ప్రభుత్వంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు.

నాగర్‌కర్నూల్

పేరు : మర్రి జనార్దన్‌రెడ్డి
తల్లిదండ్రులు : అమృతమ్మ, జంగిరెడ్డి
స్వస్థలం: నేరెళ్లపల్లి, తిమ్మాజిపేట మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా
సతీమణి : జమునారెడ్డి
సంతానం : కుమారుడు, కూతురు
పుట్టినతేదీ: 8.04.1969
రాజకీయ అరంగేట్రం : 2012 ఉపఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు.
పదవులు : 2014, 2018లో ఎమ్మెల్యేగా గెలుపు (బీఆర్ఎస్)

అచ్చంపేట

పేరు : గువ్వల బాలరాజు
తల్లిదండ్రులు: గువ్వల బక్కమ్మ, రాములు
పుట్టిన తేదీ : 30.06.1977
స్వస్థలం : పొల్కెపాడు గ్రామం, గోపాల్‌పేట మండలం, వనపర్తి జిల్లా
విద్యార్హత : బీకాం, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, లాలో డాక్టరేట్
వృత్తి: కాంట్రాక్టర్
ప్రస్తుతం ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు
భార్య : అమల
సంతానం : ఇద్దరు కుమారులు
రాజకీయ ప్రవేశం:2007లో టీఆర్ఎస్‌లో చేరారు. మొదటిసారి2009లో నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానానికి పోటీ చేసి ఓటమి
పదవులు : 2014, 2018లో ఎమ్మెల్యే

కొడంగల్

పేరు : పట్నం నరేందర్‌రెడ్డి
తండ్రి : పట్నం మల్లారెడ్డి
తల్లి : రుక్కమ్మ
పుట్టిన తేదీ : 22.01.1970
భార్య : శృతిరెడ్డి
సంతానం : కుమారుడు హితేష్‌రెడ్డి, కూతుళ్లు– దీక్ష, ఉపేక్ష (కవలలు)
చదువు : బీఎస్సీ (అగ్రికల్చర్)
రాజకీయ అరగేట్రం : దివంగత ఇంద్రారెడ్డి (మేనమామ), దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్, పట్నం మహేందర్‌రెడ్డి (అన్న)
పదవులు : పీఏసీఎస్ చైర్మన్ తాళ్లపల్లి, ఎంపీపీ, షాబాద్, ఎమ్మెల్సీగా పని చేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు కొడంగల్ ఎమ్మెల్యే

జడ్చర్ల

పేరు : చర్లకోల లక్ష్మారెడ్డి
తల్లిదండ్రులు : లక్ష్మమ్మ, నారాయణరెడ్డి
పుట్టిన తేదీ : 03.02.1962
భార్య : శ్వేత
సంతానం : కూతురు, కుమారుడు
స్వస్థలం : ఆవంచ, తిమ్మాజిపేట మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా
విద్యార్హత : బీహెచ్ఎంఎస్, గుల్బర్గా
పదవులు : 2004లో ఎమ్మెల్యేగా, 2008లో ఓటమి, 2014, 2018లో ఎమ్మెల్యే

నారాయణపేట

పేరు :సుంకి రాజేందర్‌రెడ్డి
పుట్టినతేదీ :06.05.1963
విద్యాభ్యాసం :ఎంఫార్మసీ
స్వస్థలం : శేరి వెంకటాపూర్, కోయిలకొండ మండలం, నారాయణపేట జిల్లా
తల్లిదండ్రులు :ఎస్.రాజేశ్వర్‌రెడ్డి, యశోదమ్మ
భార్య : స్వాతిరెడ్డి
సంతానం : కుమార్తె, కుమారుడు
పదవులు : 2013లో టీడీపీలోకి తొలిసారి 2014 ఎమ్మెల్యే (టీడీపీ), 2016 బీఆర్ఎస్‌లో చేరిక, 2018 ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపు

అలంపూర్

పేరు : డాక్టర్ వీఎం అబ్రహం
తల్లిదండ్రులు : గోవిందమ్మ, వెంకటన్న
స్వగ్రామం : వల్లూరు, ఇటిక్యాల మండలం, జోగుళాంబ గద్వాల జిల్లా
పుట్టిన తేదీ : 20.04.1946
విద్యార్హత : ఎంబీబీఎస్
భార్య : విజయలక్ష్మి
సంతానం : కుమార్తెలు, కుమారుడు
వృత్తి : వైద్యుడు
పదవులు : 2009లో ఎన్నికల్లో రాజకీయ రంగప్రవేశం. కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం. 2014లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి. 2018లో ఎమ్మెల్యేగా (బీఆర్ఎస్) గెలుపు.

మక్తల్

పేరు : చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
పుట్టిన తేదీ : 30.01.1963
తల్లిదండ్రులు : చిట్టెం సుమిత్ర, చిట్టెం నర్సిరెడ్డి (దివంగత ఎమ్మెల్యే)
విద్యార్హత : బీకాం
భార్య : చిట్టెం సుచరితరెడ్డి
స్వస్థలం : ధన్వాడ, నారాయణపేట జిల్లా
పదవులు : 2006, 2014, 2018లో ఎమ్మెల్యేగా గెలుపు

కొల్లాపూర్

పేరు బీరం హర్షవర్ధన్‌రెడ్డి
తల్లిదండ్రులు : బీరం బిచ్చమ్మ, లక్ష్మారెడ్డి
భార్య : విజయ
స్వస్థలం: సింగోటం, కొల్లాపూర్
విద్యాభ్యాసం : ఎంఏ, ఎల్ఎల్‌బీ
పుట్టిన తేదీ : 31.08.1978
పదవులు : 2014 ఎమ్మెల్యే (కాంగ్రెస్), 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపు (తర్వాత బీఆర్ఎస్‌లో చేరిక)

దేవరకద్ర

పేరు : ఆల వెంకటేశ్వర్‌రెడ్డి
స్వస్థలం : అన్నాసాగర్, భూత్పూర్ మండలం మహబూబ్‌నగర్ జిల్లా
తల్లిదండ్రులు : ఆల రఘుపతిరెడ్డి, వరలక్ష్మి
భార్య : మంజుల
సంతానం : ఇద్దరు కూతుళ్లు
పుట్టిన తేదీ : 30.09.1968
విద్యార్హత : బీఈ సివిల్ ఇంజినీర్
పదవులు : 2002లో టీడీపీలో చేరిక, 2006లో భూత్పూర్ జెడ్పీటీసీ, 2009లో టీడీపీకి రాజీనామా, 2010లో టీఆర్ఎస్‌లో చేరిక 2014, 2018లో ఎమ్మెల్యే (బీఆర్ఎస్)

కల్వకుర్తి

పేరు : గుర్క జైపాల్‌యాదవ్
పుట్టిన తేదీ : 25.08.1954
విద్యాభ్యాసం : బీఎస్సీ
తల్లిదండ్రులు : బల్‌రాంయాదవ్, మంగమ్మ
భార్య : రాజ్యందేవి
సంతానం : ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు
స్వస్థలం : చల్లంపల్లి, తలకొండపల్లి, (రంగారెడ్డి జిల్లా)
పదవులు : 1981 నుంచి రెండుసార్లు చల్లంపల్లి సర్పంచ్. 1995లో జెడ్పీటీసీ, తలకొండపల్లి, 1999లో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, 2009లో ఎమ్మెల్యే (టీడీపీ), 2018లో ఎమ్మెల్యే (బీఆర్ఎస్).

గద్వాల

అభ్యర్థి పేరు : బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
తల్లిదండ్రులు : బండ్ల వెంకట్రామిరెడ్డి, రేవతి
స్వస్థలం : బూరెడ్డిపల్లి, ధరూర్ మండలం
భార్య: జ్యోతి (సర్పంచ్)
సంతానం : కుమారుడు
విద్యార్హత : డిగ్రీ
పుట్టిన తేదీ : 21.09.1967
రాజకీయ ఆరంగేట్రం: 2005లో..
పదవులు : గద్వాల మండల జెడ్పీటీసీ, 2018లో గద్వాల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు (ప్రస్తుతం)

షాద్‌నగర్

పేరు :ఎల్లనమోని అంజయ్యయాదవ్
స్వస్థలం : ఎక్లాస్‌ఖాన్‌పేట, కేశంపేట (మండలం)
జన్మదినం : 10.05.1950
విద్యార్హత : బీఎస్సీ (మేథమెటిక్స్)
తల్లిదండ్రులు: బాలకిష్టమ్మ, ఆగమయ్య
సంతానం : ఇద్దరు కుమారులు
పదవులు : 2009 ఎమ్మెల్యేగా ఓటమి, 2014, 2018లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపు.

పాలమూరు అభివృద్ధికి పాటుపడుతా

నా చివరి శ్వాస ఉన్నంత వరకు పాలమూరు అభివృద్ధికా పాటుపడుతా. అభివృద్ధి చేసేందుకు ఎన్ని నిధులైన ప్రభుత్వం నుంచి తెచ్చేందుకు కృషి చేస్తా. గతంలో పాలకులు అభివృద్ధి పట్టించుకోలేదు. స్వరాష్ట్రంలో అభివృద్ధి అంటే ప్రజలకు చూపిస్తున్నాం. మినీ ట్యాంక్ బండ్, మెడికల్ కళాశాల, కేసీఆర్ అర్బన్ ఏకో పార్క్, తీగలబ్రిడ్జి, ఫుడ్‌పార్క్, ఐటీ పార్క్.. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వేలసంఖ్యలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నాం.

– శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి



మూడోసారి అధికారంలోకి వస్తాం..

ప్రజావసరాలను గుర్తించి గతమెన్నడూ.. చూడని విధంగా నాలుగు దశాబ్దాల్లో చేయలేని అభివృద్ధిని నాలుగున్నర ఏళ్లలో చేసి చూపించాను. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని మరోసారి ప్రజాక్షేత్రంలో గెలిచి ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులతో ఇంకా చేయాల్సిన ప్రణాళికలో మిగిలిన అభివృద్ధి పనులను రాష్ట్రం, వనపర్తి జిల్లా, నియోజకవర్గంలో పూర్తి చేయాలనే తలంపుతో ఎన్నికల బరిలోకి వెళ్తున్నాం. అభివృద్ధి, వ్యవసాయంలో వనపర్తి జిల్లాను రాష్ట్రంలో మొదటి వరుసలో నిలబెట్టి ప్రజలతో ఓట్లు అడిగేందుకు వెళ్తున్నాం. మూడోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావటాన్ని ఏ శక్తులు ఆపలేవు.

– నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపాం

సీఎం కేసీఆర్ సహకారంతో మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపాం. తనపై నమ్మకం ఉంచి మొదటి లిస్టుల్లో తన పేరు ప్రకటించడం ఆనందంగా ఉంది. మూడో సారి కేసీఆర్ సీఎంగా కావడం ఖాయం. మక్తల్ నియోజవకర్గంలో సంగంబండ రిజర్వాయర్, భూత్పూర్ రిజర్వాయర్ పూర్తి చేయించి దాదాపు 50 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో సంగంబండ రిజార్వాయర్ బ్యాక్‌వాటర్‌తో గాని, పాలమూర్ రంగారెడ్డి ప్రాజెక్టుద్వారా గాని ఊట్కూర్ మండల కేంద్రంలో పెద్దచెరువుకు సాగునీరు తీసుకువచ్చి ప్రతి ఎకరాను తడిపేందుకు కృషి చేస్తాం.

– చిట్టెం రాంమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, మక్తల్

పారిశ్రామిక రంగం మరింత విస్తృతం

పారిశ్రామిక రంగంలో మరింత పురోగతి సాధిస్తాం. పోలేపల్లి సెజ్ ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. మున్ముందు మరికొన్ని వేల ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యం. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉదండాపూర్ రిజర్వాయర్‌ను త్వరలోనే పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం. ఇప్పటికే కల్వకుర్తి ఎత్తిపోతల ద్వార మిడ్జిల్ మండలానికి సాగు నీరు అందిస్తున్నాం. జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో మరింత ముందుకు తీసుకెళ్తాం. తనను మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించడం ఆనందంగా ఉంది.

– లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

తక్కువ కాలంలో ఎక్కువ పనులు

కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నావంతు కృషిచేశాను. ఎమ్మెల్యేగా గెలిచాక రెండున్నరేళ్లు కరోనా పీరియడ్ కొనసాగింది. మిగిలిన రెండున్నర ఏళ్లలో కొల్లాపూర్‌కు జాతీయ రహదారి, సోమశిల ఐకానిక్ వంతెన తీసుకువచ్చేందుకు నా వంతుగా ప్రయత్నం చేశాను. కొల్లాపూర్‌కు హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలతోపాటు ఎంసీహెచ్ ఆసుపత్రి ప్రారంభించాం. రెవెన్యూ డివిజన్ సాధించాను. కేఎల్ఐ ద్వారా సాగునీరు అందించేందుకు గోపల్‌దిన్నె–సింగోటం లింకు కెనాల్‌కు, పసుపుల కెనాల్‌కు శ్రీకారం చుట్టాం. తక్కువ కాలంలో ఎక్కువ పనులు చేశా. రెండోసారి నేను ఎమ్మెల్యేగా గెలుస్తాననే నమ్మకముంది. కొల్లాపూర్‌లో బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉంది. టికెట్ కేటాయించినందుకు సీఎంకు ధన్యవాదాలు.

– బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొల్లాపూర్

నా జీవితం ప్రజాసేవకు అంకితం

కూలి బిడ్డగా పెరిగిన నేను ప్రజా సేవచేసేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టా. వ్యక్తిగత జీవితాన్ని, సంతోషాలను వదులుకొన్నా. జల కోసం ప్రాణం ఉన్నంత వరకు పని చేస్తా. రాజకీయాల్లోకి టీఆర్ఎస్ పార్టీతోనే అడుగు పెట్టా. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచా. ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు అచ్చంపేట ఎత్తిపోతల పథకం సాధించా. కేఎల్ఐ కాల్వ పొడగింపు పనులు చేపట్టి అదనపు ఆయకట్టుకు నీరు అందించే పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిపోయిన పనులు చేపట్టి నల్లమలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తాను. నాపై నమ్మకం ఉంచి మరోసారి ప్రజలకు సేవచేసే అవకాశాన్ని కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటా. గెలుపు కోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతాం.

– గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే, అచ్చంపేట

హ్యాట్రిక్ విజయం సాధిస్తాం..

తనపై నమ్మకం పెట్టి మూడోసారి పార్టీ టికెట్ ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంతో రుణపడి ఉంటా. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తుంది. దళితులు, బీసీలు, మైనార్టీలతో పాటు అన్ని రకాల కులవృత్తులకు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్ వంటి ఎన్నో బృహత్తర పథకాలు ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. గద్వాలలో గతంలో ఎన్నడూ లేనంతగా అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగింది. ప్రజలు నన్ను ఆశీర్వదించి మరోసారి అసెంబ్లీకి పంపితే గద్వాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తా. మూడోసారి కూడ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. హాట్రిక్ సాధించడం ఖాయమన్నారు.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

అభివృద్ధే గెలుపు మంత్రం

ఇప్పటి వరకు నారాయణపేట నియోజకవర్గంలో, జిల్లా ఏర్పాటుతో చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలే తన గెలుపునకు పునాది. ఒకప్పుడు విద్య, వైద్యం, ఇతర రంగాల్లో పూర్తిగా వెనకబడిపోయిన నారాయణపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేశా. నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, కోయిలకొండ వాసులకు సాగునీరు అందించడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ప్రజలకు రైలు సదుపాయం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నారాయణపేట జాయమ్మ చెరువుకు సాగునీరు తీసుకురావడమే నా లక్ష్యం. రాబోయే రోజుల్లో జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తాం. ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రానుంది.

– ఎస్.రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నారాయణపేట

గొడవపడి అన్నాచెల్లి బలవన్మరణం

- అనాథగా మారిన తల్లి
- తల్లి ఆరోగ్యస్థితి బాగా లేకపోవడంతో ఆస్పత్రిలో చేరిక
- చందాలు పొగుచేసి అంత్యక్రియలు చేసిన యువకులు



సంఘటనా స్థలం వద్ద విచారిస్తున్న ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు

నారాయణపేట: అన్నాచెల్లి బలవన్మరణంతో జిల్లా కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని పళ్ల ఏరియాలోని కోటవీధికి చెందిన చేనేత కుటుంబం అన్నాచెల్లెలు మహేష్ (35), లక్ష్మి (32) తల్లి రాములమ్మ కొన్నేళ్లగా మానసిక, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఆదివారం రాత్రి అన్నాచెల్లి గొడవపడ్డారు. దీంతో అన్న మహేష్ మనస్తాపంతో చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన చెల్లి చీరను కత్తిరించగా, అప్పటికే ఆయన మృతి చెందాడు. చెల్లి సైతం మానసిక స్థితి బాగులేకపోవడంతో ఉరేసుకుంది. తల్లి రాములమ్మకు కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఇంట్లో ఏమి అయ్యిందో తెలియని పరిస్థితి. తెల్లారేసరికి కొడుకు, కుతురుని పిలిచినా పలకకపోవడంతో రోధించింది. చుట్టుపక్కల వారు వచ్చి చూడడంతో వారు మృతి చెందినట్లు గమనించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాంలాల్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఏఎస్ఐ ఆరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చందాలు పోగుచేసి అంత్యక్రియలు

అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ లేకపోవడంతో సింగిల్ విండో డైరెక్టర్ మల్లేష్, నాయకులు కెంచె శ్రీనివాస్, గోపాల్‌యాదవ్, ఆ ప్రాంత యువకులు ముందుకు వచ్చి చందాలను పోగుచేశారు. పోలీసు అధికారులు సైతం వారికి తోచిన ఆర్థిక సాయం చేశారు. పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించి యువకులు మానవత్వం చాటుకున్నారు.

రాములమ్మను జిల్లా ఆస్పత్రికి తరలింపు

కొడుకు, కుమార్తె మృతి చెందడంతో తల్లి రాములమ్మ అనాథగా మారింది. పళ్ల ఏరియా యువకులు ఆమెను ఆటోలో వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగలేకపోవడంతో సిబ్బంది నిరాకరించింది. దీంతో ఆమెను జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారాన్ని డీడబ్ల్యూఓ వేణుగోపాల్‌కు ఇవ్వగా ఆయన స్పందించి సఖి కేంద్రం నుంచి సిబ్బందిని పంపించారు. వృద్ధురాలి ఆరోగ్యం బాగైన తర్వాత వృద్ధాశ్రమనికి తరలిస్తామని తెలిపారు.

ఇంజినీర్లకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న ఇంజినీర్లు, ఉద్యోగులు

దోమలపెంట: శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో మృతి చెందిన ఇంజినీర్లు, జేపీఏలు, ఇతర సిబ్బంది తొమ్మిది మందికి సోమవారం భూగర్భ కేంద్రం సీఈ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదం నుంచి భూగర్భ కేంద్రానికి కాపాడేందుకు చివరి శ్వాస వరకు ధైర్యసాహసాలతో పోరాడి ప్రాణాలర్పించారన్నారు. వారి కుటుంబాలను జెన్కో యాజమాన్యం ఆదుకుందని, వారు లేని లోటును మాత్రం పూడ్చలేమన్నారు. రాష్ట్రంలోని అన్ని జెన్కో కేంద్రాల్లో అక్కడి ఇంజినీర్లు, ఉద్యోగులు నివాళి అర్పించాలన్నారు. కేంద్రం ఓఅండ్ఎం ఎస్ఈ ఆదినారాయణ, ఎస్ఈ సివిల్ రవీంద్రకుమార్, డీఈ టెక్నికల్ శ్రీధర్, ఈఈ సివిల్ రమేష్ ఇంజినీర్లు, ఉద్యోగులు, ఆర్టిజన్లు పాల్గొన్నారు.

ఉరేసుకుని భర్త.. అనుమానాస్పదంగా భార్య మృతి

సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించిన డీఎస్పీ

నారాయణపేట రూరల్: మండలంలోని చిన్నజట్రానికి చెందిన కుమ్మరి అంజిలమ్మ, ఊషన్నలు కుల వృత్తితో పాటు వారికి ఉన్న ఎకరన్నర పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కుమారుడు నరేష్(25)తో పాటు కుమార్తె ఉంది. ఏడు సంవత్సరాల కిందట ఊషన్న దేవరకద్ర బస్టాండ్ వద్ద బస్సు ఢీకొని మృతిచెందాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉండేవారు. రెండేళ్ల కిందట కుమారుడికి సీసీకుంట మండలానికి చెందిన అమ్మాయితో వివాహం కాగా.. మధ్యలో వదిలిపెట్టింది. మూడు నెలల కిందట కోయిలకొండ మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన రేవతితో రెండో వివాహం చేసుకున్నాడు. నరేష్ ఎంఏ చదువుకున్నా.. పొలం పనులు చేస్తుండేవాడు. రేవతి సైతం కూలి పనులకు వెళ్తుండేది. సోమవారం నాగుల పంచమి కావడంతో దేవాలయానికి వెళ్లి పాలుపోసి వచ్చి మధ్యాహ్నం భోజనం చేసి ఇరుగుపొరుగు వారితో మాట్లాడారు. ఇక తల్లి అంజిలమ్మ వరి చేనులో కలుపు తీయడాని వెళ్లగా, చెల్లి పత్తిచేనులో పనికి వెళ్లిది. ఇంట్లో భార్యాభర్తలు మాత్రమే ఉన్నారు. వారి మధ్య ఏం జరిగిందో తెలియదు.. రాత్రి సమయంలో తల్లీ, కుమార్తె ఇంటికి వచ్చే వరకు భార్యభర్తలు విగత జీవులుగా పడి ఉన్నారు. రేవతి మంచంపై అచేతన స్థితిలో ఉండగా.. అక్కడే ఫ్యాన్‌కు నరేష్ ఉరి వేసుకుని ఉన్నాడు. అయితే భార్యను చంపి భయంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే డీఎస్పీ సత్యనారాయణ, ఎస్ఐ జయప్రసాద్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి



మంగ్యా (ఫైల్)

వీపనగండ్ల: మండల పరిధిలోని నాగర్లబండతండాకు చెందిన రాత్లావత్ మంగ్యా (45) సోమవారం నల్గొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 4 సంవత్సరాల క్రితం కుటుంబాన్ని పోషించుకునేందుకు నల్గొండకు వెళ్లిన మంగ్యా అక్కడ కూలీ పని చేసేవాడని తండా వాసులు తెలిపారు. సోమవారం ఉదయం ప్రైవేట్ బస్సు టైర్లు బస్ట్ అవ్వడంతో బైక్‌పై వెళ్తున్న మంగ్యాను ఢీకొట్టినట్లు వివరించారు. దీంతో ఘటనా స్థలంలోనే అతను మృతి చెందినట్లు పేర్కొన్నారు. మంగ్యాకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

బాలానగర్: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రం సమీపంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వాహనం ఢీకొనడంతో 28ఏళ్ల వయస్సు గల యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలకు బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

భూత్పూర్ దివిటిపల్లి వద్ద మరొకరు..

భూత్పూర్: మండలంలోని దివిటిపల్లి బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. జడ్చర్ల నుంచి భూత్పూర్ వైపు వస్తున్న రహదారిలో బ్రిడ్జిపై నడుచుకుంటూ వస్తున్న 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో ముఖం గుర్తుపట్టని విధంగా ఉందన్నారు. తెల్లని షర్టు, నల్లని షాట్ ఉందని, ఎవరికైన ఆచూకి తెలిస్తే 8712659350 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి నడిగడ్డ బస్వయ్య(37) ఇంట్లోనే ఉరేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో గడియ వేసుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకోవడాన్ని గమనించిన భార్య శైలజ ఇరుగుపొరుగు వారి ని అప్రమత్తం చేసి ఇంటి తలుపులు తీసి చూసే లోపే మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

VIJAYA DIAGNOSTIC CENTRE
Hiring for Mahabubnagar
WALK-IN
25 & 26 August, 2023 (Friday & Saturday)
Time: 10:00 am - 4:30 pm

- Sample Collection (Phlebotomists) (Exp. 2 years & Above) - DMLT / MLT / B.Sc-MLT
- X-Ray Technicians Male/Female (Exp. 1 year & Above) - DMIT / B.Sc-Radiology
- Branch Manager (Min Exp. 4 to 8 years in Health care) - Graduate / Post Graduate
- CT & MRI Technicians (Exp. 6 to 9 years) - (DMIT / B.Sc-Radiology)
- Front Office Executives (Min Exp. 1 to 2 years) - Any Graduate / Post Graduate
- Lab Technicians - Bio Chemistry / Haematology / Clinical Pathology / Microbiology (Exp. 2 to 10 years)
- Typists (Relevant Exp. 3 to 5 years) - Graduate / Post Graduate
- Patient Relationship Executives (Exp. 2 to 5 years) - Graduate / Post Graduate
- Staff Nurses (Min Exp. 1 to 3 years) GNM / B.Sc-Staff Nurse
- Ultrasound Assistants - Female (Fresher or 1 to 2 years experience) Inter / Graduate
- House Keeping Supervisors (Exp. 2 to 5 years) Graduate
- Electricians (Exp. 2 to 5 years) - ITI-Electrician
- Consultant Pathologists (Exp. 2 plus years) - MD / DNB Pathology
- Consultant Biochemists Exp. 2 plus years) - MD-Biochemistry
- Consultant Radiologists (Exp. 2 plus years) - MD / DNB / DMRD-Radiology
- Audit Executives (Exp. 2 to 4 years) - Graduate / Post Graduate
- Maintenance Supervisors (Exp. 2 to 5 years) - ITI-Electrician
- Sales and Marketing Executives (Exp. 3 to 6 years) Graduate / Post Graduate
- Executives-Stores and Procurement (Exp. 2 to 5 years) - Graduate / Post Graduate
- Ambulance Drivers (Exp. 2 to 3 years) - Required Badge Number

Please carry your Photograph, Educational & Experience Certificates.
1st Floor, Kritunga Restaurant, Shree 9 Complex, Opp: TRS Party Office, New Town, Rajendranagar, Mahabubnagar - 509001.
Ph: +91 91000 96499, 91004 45367
Email: careers@vijayadiagnostic.in NO NIGHT SHIFTS

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
జనరల్ ఇంటర్మీడియట్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ అన్ని సబ్జెక్టులు T.S ద్వారా ప్రమురించబడుతాయి ... న్యూటౌన్, మహబూబ్‌నగర్. సంప్రదించవలసిన నెంబర్లు: 9246572697, 7207636194, 9246572822, 9676869638.

WANTED
మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ ... వివరాలకు కాల్ చేయండి. 95738 33520, 90596 33520.
... వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, వార్డ్‌బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9891096931, 9246585901
... హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K. ఫోన్ : 9640258899, 9640468899

సాక్షి భవిత విద్యార్థుల కోసం

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో ... – సాక్షి మేనేజ్‌మెంట్

చేప అరుదు.. తీరు బెదురు

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని కాల్వలో అరుదైన చేప లభించింది. ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి సాయిచరణ్‌కు సోమవారం చూడటానికి వింతగా..



రాయిలా గట్టిగా ఉన్న చేప కనిపించడంతో స్థానిక డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు సదాశివయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా సదాశివయ్య మాట్లాడుతూ 'ఇది హైపోస్టోమస్ ప్లెకోస్టోమస్ అనే విదేశీ చేప. సాధారణంగా దీన్ని సక్కర్ మౌత్ క్యాట్ ఫిష్ అంటారు. ఇది దక్షిణ అమెరికా ప్రాంతానికి చెందింది. ఈ చేపలు నీటిలోని నాచు, నీటి మొక్కలతో పాటు నత్తలు, చిన్నచిన్న చేపలు ఇతర నీటి జీవులను తింటాయి. ఇవి ఒళ్లంతా చిన్నపాటి ముళ్లను కలిగి గట్టిగా ఉంటాయి. వీటి నోరు పూర్తిగా కింద భాగాన ఉంటూ నాచును పీల్చడానికి ఉపయోగపడుతుంది. ఇవి దాదాపు అరమీటరు పొడవు పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ చేపను ఆహారంగా తీసుకోరాదు. అక్వేరియంలో నాచును శుభ్రపర్చడానికి మాత్రమే వినియోగించాలి' అని సదాశివయ్య వివరించారు.

60, 70 శాతం ఫీజు తీసుకోండి

ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజుపై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజు వసూళ్లకు సంబంధించి హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. మొత్తం ఫీజులో ఏ–కేటగిరీ విద్యార్థుల నుంచి 60 శాతం, బీ–కేటగిరీ విద్యార్థుల నుంచి 70 శాతమే తీసుకోవాలని కాలేజీలను ఆదేశించింది. మిగతా ఫీజు చెల్లింపు ఎలా అన్నది తుది ఉత్తర్వుల్లో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుతూ ప్రభుత్వం జీవో నంబర్ 107ను తీసుకొచ్చిందని, నిబంధనలకు విరుద్ధంగా తీసుకొచ్చిన దీన్ని రద్దు చేయాలని కోరుతూ డాక్టర్ వెంకటదుర్గ అశోక్‌తో పాటు మరో 221 మంది పీజీ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ చిల్లకూర్ సుమలత విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి వాదనలు వినిపించారు. కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా రెండింటిలోనూ 179 శాతం నుంచి 296 శాతం వరకు ఫీజులు పెంచడం సమర్థనీయం కాదని, చట్టప్రకారం చదువుకునే హక్కును హరించినట్లే అవుతుందన్నారు. ఇప్పటికే ఈ ఫీజులకు సంబంధించిన పిటిషన్ ఇదే హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రస్తుతానికి విద్యార్థుల నుంచి 60 శాతం, 70 శాతం మాత్రమే ఫీజు తీసుకోవాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగాతెలంగాణ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్రానికి చెందిన పలువురు ముఖ్య నేతలను నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన వారిలో మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌తోపాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలున్నారు. మాజీ ఎంపీలు డి.రవీంద్రనాయక్, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రమేశ్ రాథోడ్, చాడ సురేశ్‌రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యేలు టి.రాజేశ్వర్‌రావు, వి.జయపాల్, వన్నాల శ్రీరాములు, జి.రామకృష్ణారెడ్డి, బొడిగె శోభ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయసుధ, ఆకుల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు.

ధరణితో పేదలను దగా చేశారు

- బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి ధ్వజం
- మాస్టర్‌ప్లాన్ పేరిట భూములు కొల్లగొట్టే యత్నం
- నిర్మల్‌లో ఏలేటికి పరామర్శ.. దీక్ష విరమణ



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తూ..

నిర్మల్: తెలంగాణ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చారని, సీఎంతో పాటు మంత్రి కేటీఆర్ మార్కెటింగ్ బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ధరణి పోర్టల్ తెచ్చి రైతులను దగా చేశారని ధ్వజమెత్తారు. తాజాగా మాస్టర్ ప్లాన్ పేరుతో రైతుల భూములు కొల్లగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్ మార్చాలని జిల్లా కేంద్రంలో ఆరు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కిషన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మహేశ్వర్‌రెడ్డి, జిల్లా యువత, రైతులు వారం రోజుల పాటు చేసిన పోరాటం అభినందనీయమని అన్నారు. వీరి కృషి కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గిందని చెప్పారు.

పోరాటంతో దిగివచ్చిన మున్సిపాలిటీ

ఆరురోజులుగా దీక్ష చేస్తున్న ఏలేటిని సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు బలవంతంగా ఆయన ఇంటి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సెలైన్లు పెట్టి వైద్యచికిత్స చేయించారు. అయినా ఆయన నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ క్రమంలో నిర్మల్ వెళ్లిన కిషన్‌రెడ్డి ఏలేటిని పరామర్శించారు. తమ పోరాటానికి నిర్మల్ మున్సిపాలిటీ దిగివచ్చి తీర్మానం చేసిందని తెలిపారు. నిమ్మరసం ఇచ్చి ఆమరణ దీక్ష విరమింపజేశారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల సందర్భంగా పోలీసులు జరిపిన లాఠీచార్జిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను కూడా కిషన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఏలేటి నివాసంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

భూవ్యాపారం దారుణం..

నిర్మల్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూమిని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసభ్యుల పేరిట మార్చుకుని భూవ్యాపారం చేయడం దారుణమని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రమంతా ఇదే సమస్య ఉందని, అధికార పార్టీ నాయకులు అక్రమ భూదందాలు చేస్తున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ తో సీఎం పేదలను దగా చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు భూములను తమ ఖాతాలో వేసుకుంటూ మాఫియాలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ధరణి కారణంగా అనేకమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటూ, ఇవన్నీ కేసీఆర్ కుటుంబం చేసిన హత్యలేనని ఆరోపించారు. నిర్మల్‌లో కూడా 260 ఎకరాల భూమిని మంత్రి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఎందుకు అమ్మేసిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. నయా నిజాం కేసీఆర్‌పై సమష్టిగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

హైకోర్టు విచారణలు ప్రత్యక్ష ప్రసారం

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన ప్రత్యక్ష ప్రసార సేవలను ప్రారంభించి.. న్యాయవాదులకు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత 10.30గ. నుంచి కోర్టుల విచారణలు ప్రత్యక్ష ప్రసారమ య్యా యి. ప్రత్యక్ష ప్రసారాలతో న్యాయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని సీజే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

లింక్ క్లిక్ చేస్తే...

హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించిన లింక్ ఇచ్చారు. ఈ లింక్ ద్వారా కోర్టును ఎంపిక చేసుకుని ప్రత్యక్ష ప్రసారాలు వీక్షించవచ్చు. ఫస్ట్ కోర్టు విచారణ ప్రత్యక్ష ప్రసారం ఇప్పటికే అందుబాటులో ఉంది. కరోనా సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు కొనసాగగా, ఆ తర్వాత హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడుతున్నారు. 2020లో ప్రత్యక్ష ప్రసారాలను అందుబాటులోకి తెచ్చిన గుజరాత్ హైకోర్టు, ఆ తర్వాత యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించింది. కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టులు కూడా ప్రత్యక్ష ప్రసారాలు, యూట్యూబ్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ప్రత్యక్ష ప్రసారాలతో పారదర్శకత పెరుగుతుందని న్యాయ నిపుణులు పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇదిలాఉండగా, హైకోర్టు, కిందికోర్టుల విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ 2022లో హై కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కూడా దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన నాటి సీజే ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులోభాగంగా ప్రసారాలకు కావాల్సిన మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

లోక్‌సభ ఎన్నికల కోసమేనా..?

కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీపై చర్చ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తో పాటు, కామారెడ్డిని కూడా ఎంచుకోవడం ఉమ్మడి మెదక్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2014, 2018 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి ఘన విజయం సాధించిన కేసీఆర్..తన హయాంలో గజ్వేల్ రూపురేఖలు మార్చేశారు. అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారు. తాజాగా ఆయన కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో ఆ నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే రానున్న పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకునే కేసీఆర్ కామారెడ్డిని కూడా ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కామారెడ్డి అసెంబ్లీ స్థానం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉంటుంది. కామారెడ్డిలో పోటీ చేయడం ద్వారా జహీరాబాద్‌తో పాటు, నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు సునాయాసంగా అవుతుందనే ఉద్దేశంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకుని ఉండి ఉంటారనే చర్చ జరుగుతోంది.



5కిలోల బంగారాన్ని ఈఓ గీతారెడ్డికి జీయర్‌స్వామి సమక్షంలో అందజేస్తున్న మైహోమ్స్ అధినేత రామేశ్వర్‌రావు దంపతులు.

అతి సుందరం.. కళాత్మకం..

యాదాద్రిని ల్యాండ్ మార్క్‌లా తీర్చిదిద్దిన కేసీఆర్.. ముఖ్యమంత్రిపై చినజీయర్‌స్వామి ప్రశంసలు

యాదగిరిగుట్ట: 'యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధాన ఆలయం అతిసుందరంగా, కళాత్మకంగా నిర్మాణం జరిగింది.. శ్రీస్వామి వైభవానికి ఈ శతాబ్దిలో పెద్ద ల్యాండ్‌మార్క్ అనేలా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారు.. ఇందుకు ముఖ్యమంత్రికి అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను. ఆరంభించిన సంకల్పాన్ని అద్భుతమైన రీతిలో పూర్తి చేసుకున్నారు' అని శ్రీవైష్ణవ పీఠాధిపతి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామిజీ అన్నారు. యాదాద్రీశుడిని సోమవారం దర్శించుకున్న అనంతరం ఉత్తర మాఢవీధిలో విలేకరులతో మాట్లాడారు. ప్రాచీన కళ యాదాద్రి ఆలయంలో ఉట్టిపడుతోందని, సీఎం కేసీఆర్ యాదాద్రి క్షేత్రాన్ని ప్రాచీన వైభవాన్ని తెలియజేయాలనే రీతిలో నిర్మాణం చేశారన్నారు. ఇంత మంచి కార్యాన్ని నెరవేర్చగలిగే అదృష్టం భగవంతుడు ముఖ్యమంత్రికి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. శ్రీనృసింహస్వామి తెలంగాణ రాష్ట్రానికి రక్షకుడిగా ఉన్నారని, దానికి తగ్గట్లుగా ఆలయ నిర్మాణం జరిగిందన్నారు.

బంగారు తాపడంకోసం 5 కిలోల బంగారం..

విమాన గోపురానికి బంగారు తాపడం కోసం శ్రీస్వామి వారికి డాక్టర్ రామేశ్వర్‌రావు గతంలో ఒక కిలో బంగారం సమర్పిస్తామని వాగ్దానం చేశారని స్వామీజీ తెలిపారు. ఈ కిలోకి మరొక నాలుగు కిలోలను చేర్చి మొత్తంగా 5 కిలోల బంగారాన్ని విమాన గోపురానికి తాపడం కోసం సమర్పించినట్లు జీయర్‌స్వామి చెప్పారు. పెరుమాళ్ల సన్నిధిలో ఆలయ అధికారులకు 5 కిలోల బంగారం డాక్టర్ రామేశ్వర్‌రావు అందజేశారన్నారు.

నిత్య కల్యాణ మండపానికి శంకు స్థాపన..

యాదాద్రి కొండపై గల బాలాలయం ఏర్పాటు చేసిన ప్రాంగణంలో చాలా కాలం శ్రీస్వామి వారు ఉన్నారని, ఆ ప్రాంగణంలో నిత్య కల్యాణం జరిపేందుకు మండపం నిర్మాణం చేసేందుకు పూజలు చేశామని జీయర్‌స్వామి తెలిపారు. త్వరలోనే డాక్టర్ రామేశ్వర్‌రావు ఈ నిర్మాణం పూర్తి చేసే బాధ్యతను స్వీకరిస్తారన్నారు. కాగా, ప్రధానాలయ ఉద్ఘాటన జరిగిన ఏడాదిన్నర తరువాత సోమవారం చినజీయర్ యాదాద్రికి వచ్చారు. ఆయన వెంట త్రిదండి దేవనాథ స్వామి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, వైటీడీఏ వైస్‌ఛైర్మన్ కిషన్‌రావు ఉన్నారు.



నాగోబా ఆలయానికి పోటెత్తిన భక్తులు

నాగుల పంచమి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

– ఇంద్రవెల్లి

నెట్టెంపాడుకు కొనసాగుతున్న పంపింగ్



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి సోమవారం సాయంత్రానికి 1,808 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 89 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870 క్యూసెక్కులు, కుడి కాల్వకు 738 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 851 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,262 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.068 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 858.9 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 858.9 అడుగుల నీటిమట్టం, 102.6 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 8,500, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,025, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 2.608 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 4,811 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

రామన్‌పాడులో 1,019..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమాఫేజ్–2 ద్వారా 851, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

సెప్టెంబర్ 15న 'పాలమూరు' నీళ్లు

- వచ్చే నెలలో మొదటి పంపు ద్వారా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నీటి విడుదల
- ఈనెల 31న డ్రైరన్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి
- ఇంజినీరింగ్ అధికారులతో సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్



ప్యానల్ బోర్డు పనులను పరిశీలిస్తున్న స్మితాసబర్వాల్

సాక్షి, నాగర్‌కర్నూల్/కొల్లాపూర్ రూరల్/బిజినేపల్లి: సెప్టెంబర్ 15న పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు మొదటి పంపుద్వారా నీటి విడుదల ప్రారంభించాలని సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కృష్ణాతీరంలోని నార్లాపూర్ వద్ద చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు టన్నెల్, పంప్‌హౌజ్ పనులను ఆమె పరిశీలించారు. నార్లాపూర్ రిజర్వాయర్‌తో పాటు పంపింగ్ మెయిన్, మోటర్ల బిగింపు, పంప్‌హౌజ్, టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిపై సమీక్షించారు. మొదటగా ఒక మోటరు పంపును సిద్ధం చేసి నార్లాపూర్, ఏదుల, వట్టెం రిజర్వాయర్లను నింపేలా సన్నద్ధం కావాలన్నారు. ఇందుకోసం ఈనెల 31న డ్రై రన్ చేపట్టాలని చెప్పారు. గడువు లోగా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పూర్తి చేయాలని, సాంకేతిక సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను నిర్దేశించారు. సెప్టెంబర్ 15 నుంచి మొదటి పంపు ద్వారా నీటి విడుదల అనంతరం సెప్టెంబర్ 25 నుంచి రెండో మోటరు పంపు ద్వారా నీటిని ఎత్తిపోసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. ఇందుకు అనుగుణంగా మోటర్ల బిగింపుకు ఎంత సమయం పడుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లభించేందుకు కృషి చేసిన ఇంజినీరింగ్ అధికారులను ఆమె అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ ప్రాజెక్టుల సలహాదారు పెంటారెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇప్పటికే విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేశామని, మోటార్ల బిగింపు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని వివరించారు. ఏదుల, వట్టెం రిజర్వాయర్లకు కూడా అక్టోబర్ 7 వరకు రెండు పంపులు పూర్తి చేసి ఏదుల నుంచి అక్టోబర్ 15న నీటిని విడుదల చేస్తామన్నారు.అక్టోబర్ చివరి వరకు వట్టెం నుంచి నీటిని విడుదల చేస్తామన్నారు. పంపహౌజ్‌లోని టెక్నికల్ పనులన్ని పూర్తి చేశామన్నారు.

■ మిషన్ భగీరథ పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటి విడుదలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు పూర్తి చేయాలని స్మితాసబర్వాల్ అధికారులను ఆదేశించారు. కోడుపర్తి శివారులో వివాదాస్పదంగా ఉన్న మూడు ఎకరాల భూమి సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం తిమ్మాజీపేట మండలంలోని గుమ్మకొండ శివారులో కొనసాగుతున్న మిషన్ భగీరథ పనులను ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట నీటిపారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, అదనపు కలెక్టర్ సీతారామారావు, ప్రాజెక్టు సీఈ హమీద్ ఖాన్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2న మెగా జాబ్‌మేళా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ అభ్యర్థుల్లో 10 వేల మందికి ఉద్యోగం కల్పించేలా సెప్టెంబర్ 2వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవినాయక్

రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ద్వారా గతేడాది రాష్ట్రంలోని 17 జిల్లాల్లో జాబ్‌మేళాలు నిర్వహించి 32 వేల మందికి ఉద్యోగాలు ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. శిల్పారామంలో నిర్వహించనున్న జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో గతేడాది 2,800 మందికి ఉద్యోగాలు కల్పించామని, జీడిమెట్ల, ఎల్‌బీనగర్, హైదరాబాద్‌లోని పారిశ్రామిక కంపెనీలతో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించామని తెలిపారు. గత నెల మహబూబ్‌నగర్ ఐటీ కారిడార్‌లో 750 మందికి ఉద్యోగాలు ఇచ్చే విధంగా జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. మేళా రోజే 105 కంపెనీలు ఇంటర్వ్యూలు చేయడంతో పాటు ఉత్తర్వులు కూడా అందజేస్తాయన్నారు. రూ.15 వేల నుంచి రూ.లక్ష వరకు జీతం వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని, పదో తరగతి మొదలుకొని డిగ్రీ వరకు అర్హతను బట్టి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ విద్యార్హతలు బట్టి ఉద్యోగాలు ఇస్తున్నామని, ఎవరికైనా శిక్షణ అవసరమైతే శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెట్విన్ ఎండీ వేణుగోపాల్, అడిషనల్ ఎస్పీ రాములు, డీఎస్పీ మహేష్ సెట్ మా మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని ఎదిర ప్రభుత్వ పాఠశాలలో సోమవారం రోబోటిక్స్ వర్క్‌షాప్‌ను డీఈఓ రవీందర్ ప్రారంభించారు. ఈ మేరకు సోహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డీఈఓ తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 21 పాఠశాలల్లో రోబోటిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించేందుకు కలెక్టర్ అనుమతించారని, ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం కొత్త టెక్నాలజీపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రయాన్ వంటి ప్రయోగాలు విద్యార్థుల్లో ఆలోచనను రేకెత్తిస్తాయని, వాటికి సహకారం అందించాలంటే ఇలాంటి వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. సోహం అకాడమీ అధినేత సహదేవ్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సోమవారం షాసాబ్‌గుట్ట, బేసిక్ ప్రాక్టిసింగ్ స్కూల్‌లో సైతం కార్యక్రమం నిర్వహించారు. దశలవారీగా అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, అకాడమీ ప్రతినిధులు రాహుల్, మంజులత, జేపీఎన్‌సీ ప్రిన్సిపల్ సుజీవన్, ఏఎస్ఎం నరేష్, ఉపాధ్యాయులు చెన్నప్ప, సాయిబాబ పాల్గొన్నారు.

12 దేశాలు.. 72 వేల కిలోమీటర్లు

- భూతాపం, కార్బన్ ఉద్గారాల నష్టాన్ని వివరిస్తూ యువకుడి సైకిల్ యాత్ర
- కన్యాకుమారి నుంచి దక్షిణ కొరియా వరకు



అడ్డాకుల మండలంలోని హైవేపై సైకిల్‌యాత్ర చేస్తున్న శ్రీనాభవ్

అడ్డాకుల: భూతాపం, కార్బన్ ఉద్గారాల కారణంగా సంభవించే నష్టాలను వివరిస్తూ.. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను చైతన్యం చేస్తూ.. సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు ఈ యువకుడు. తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ బాలాజీ, అభిరామి దంపతుల కుమారుడైన 22 ఏళ్ల శ్రీనాభవ్ బీఎస్సీలో హాస్పిటాలిటీ పూర్తి చేశాడు. కన్యాకుమారి నుంచి దక్షిణ కొరియా వరకు చేయనున్న సైకిల్ యాత్రను ప్రపంచ బైసైకిల్ డేను పురస్కరించుకుని జూన్ 3న కన్యాకుమారిలో ప్రారంభించాడు. ప్రతి రోజు సుమారు 100–120 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేస్తున్నాడు. ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ ఛానెల్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన మిత్రుల వద్ద ఆశ్రయం పొందుతూ సైకిల్ యాత్రను కొనసాగిస్తున్నాడు. సోమవారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సైకిల్ యాత్ర సాగింది. మన దేశంతో పాటు నేపాల్, భూటాన్, చైనా, మయన్మార్, సింగపూర్, హాంకాంగ్, మలేసియా, థాయ్‌లాండ్, కంబోడియా, లావోస్, వియత్నం మీదుగా సుమారు 72 వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేసి దక్షిణ కొరియాకు చేరుకుంటానని తెలియజేశాడు.

సుమారు 4 ఏళ్లు

ఈ యాత్ర పూర్తి చేసేందుకు సుమారు 4 ఏళ్లు పట్టే అవకాశం ఉందని చెప్పాడు. ప్రయాణ మార్గంలోని పాఠశాలలు, గ్రామాల్లోని ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించాడు. కర్బన ఉద్గారాలతో కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ.. దీని నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. ప్రతి రోజూ రూ.400 నుంచి రూ.500 ఖర్చవుతున్నట్లు చెప్పాడు. తన వద్ద ఉన్న సేవింగ్ మనీతోనే యాత్ర చేస్తున్నానని, తర్వాత దాతల సాయం కోరతానని పేర్కొన్నాడు.

ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం తగదు

- మాజీ ఎంపీ మల్లురవి

జడ్చర్ల: ప్రజాస్వామ్యంలో ఎవరిక వారు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ, తమ పార్టీ వస్తే ప్రజలకు ఏం మేలు చేస్తారో చెప్పడం సహజమని ఇలాంటి పరిస్థితిలో అధికార బలంతో దాడులు చేయడం హేయమైన చర్య టీపీసీసీ నేత, మాజీ ఎంపీ మల్లురవి అన్నారు.



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న మల్లురవి, అనిరుధ్‌రెడ్డి

మండలంలోని నసరుల్లాబాద్‌లో ఆదివారం టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించారు. గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆయన పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీకి లభిస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక అధికార పార్టీ నాయకులు భయభ్రాంతులను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఎన్ని కుట్రలు చేసిన వచ్చే ఎన్నికలలో పార్టీని గెలిపించేందుకు ప్రజలు నిర్ణయం తీసుకున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎక్స్‌టెన్షన్ లెక్చర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం సోషల్ సైన్స్ విద్యార్థులకు 'ఆన్ ఎక్స్‌టెన్షన్ లెక్చర్ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ సోషల్ సైన్సెస్ అండ్ కెరియర్ ప్రాస్పెక్టివ్స్' నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుదర్శన్ పసుపులేటి, టెక్సాస్ యూనివర్సిటీ యూఎస్ఏ, సుశీల శ్రీనివాస్ హాజరవుతారు.